క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



విజయపురిసౌత్: సమృద్ధి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని విజయపురిసౌత్ ఎస్ఐ షేక్ మహమ్మద్ షఫీ అన్నారు. శుక్రవారం విజయపురిసౌత్ లో సాగర్ మాత మహోత్సవాలను పురస్కరించుకుని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. చలివేంద్రాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రమేష్ నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

గురజాల : వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ కె.నగేష్ ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్, నీటి పారుదల శాఖ ఎస్ఈ ఆదేశాల మేరకు గురజాల పరిధిలోని దైద - గొట్టిముక్కల మేజర్, రామాపురం మేజర్ కాలువ పరిధిలోని రైతులకు నాగార్జున సాగర్ రైట్ కెనాల్‌లోని ప్రస్తుత నీటి నిల్వల ఆధారంగా మార్చి నెలాఖరు వరకు వారబందీ ప్రకారం నీరు విడుదల చేయడం జరుగుతుందన్నారు. అవసరమైన మేరకు సాగునీటిని వాడుకోవాలని, వృథా చేయొద్దన్నారు.

దివ్యాంగులకు ఉచితం



మాచర్ల: పట్టణంలో దివ్యాంగులకు ఉచితంగా ఆటో సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆటో యజమాని కేతావత్ మల్లు నాయక్ శుక్రవారం తెలిపారు. కొన్ని నెలలుగా పట్టణంలో దివ్యాంగులు ఎక్కడ కనిపించినా ఆటో ఆపి, ఎక్కించుకుని గమ్యస్థానాలకు ఉచితంగా తీసుకెళ్తున్నాడు. ఆటో వెనుక భాగంలో దివ్యాంగులకు ప్రయాణం ఉచితమంటూ రాయించాడు.

కూలి కోసం..కోటి పాట్లు



రెంటచింతల: మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేదు. గ్రామాలకు వెళ్లాలన్నా.. వ్యవసాయ పనులకు కూలీలు పోవాలన్నా ఇలా ప్రమాదకరంగా ప్రయాణించాల్సిందే. మంచికల్లు, రెంటాల, మిట్ట గుడిపాడు, పశర్లపాడు, జెట్టిపాలెం, గోలి, మల్లవరం తదితర గ్రామాల ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కూలీలు పొలం పనులకు ఇలా ఆటోలో 15 నుంచి 20 మందిని తరలిస్తున్నారు. ప్రస్తుతం ఏ ప్రాంతంలో ప్రమాదం జరిగినా.. అవి ఎక్కువగా ఆటో ప్రమాదాలే ఉంటున్నాయి. ప్రజలకు తప్పని పరిస్థితుల కారణంగా ఆటోలను ఆశ్రయిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణం చేయడం వలన ప్రమాదాలు జరిగి వారి కుటుంబాలకు విషాదం మిగిల్చే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైన సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తపస్సు కాలం.. ఎంతో పవిత్రం

రెంటచింతల: యహోవా దేవుని కుమారుడు లోక రక్షకుడైన ఏసుక్రీస్తు శిలువ మరణం పొందిన అంతిమ ఘడియల్లో పడిన శ్రమను గుర్తు చేసుకుంటూ ఇప్పటికీ ప్రపంచ క్రైస్తవ లోకం ఎంతో పవిత్రంగా ఈ తపస్సు కాలంలో ప్రత్యేక ప్రార్థనలో పాల్గొంటారని స్థానిక కానుక మాత చర్చి విచారణ గురువు ఫాదర్ వైఎల్ మర్రెడ్డి అన్నారు. శుక్రవారం నిర్వహించిన తపస్సు కాల ప్రత్యేక ప్రార్థనలో ఆయన పాల్గొని భక్తులను ఉద్దేశించి, మాట్లాడారు. ప్రభువైన ఏసుక్రీస్తు ప్రపంచ మానవాళిని పాపాల నుంచి కాచిపాడేందుకు శిలువ మరణం పొందారన్నారు. తపస్సు కాలంలో దీక్ష తీసుకునే భక్తులు ఎంతో నిష్టతో 40 రోజులుగా ఈ ప్రత్యేక ప్రార్థనలో పాల్గొనాలని కోరారు.

పప్పు ఎక్కడ?



గురజాలలో వాహనం ద్వారా రేషన్ సరుకులు అందిస్తున్న దృశ్యం (ఫైల్)

- ఐదు నెలల నుంచి అరకొరగా కందిపప్పు సరఫరా
- మార్చి నెలలో పూర్తిగా చేతులెత్తేసిన సివిల్ సప్లయీస్
- ఏ నెల.. ఏ సరుకు ఆగుతుందోనన్న ఆందోళనలో కార్డుదారులు

గురజాల: సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ప్రొటీన్‌ను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోంది. రేషన్ దుకాణాల నుంచి కందిపప్పు పంపిణీని నిలిపివేసింది. గడిచిన ఐదు నెలల నుంచి రేషన్ దుకాణాల ద్వారా పూర్తి స్థాయిలో కందిపప్పు సరఫరా కావడం లేదు. దీంతో పేదలు మార్కెట్‌లో అధిక దరకు కందిపప్పు కొనుగోలు చేయలేకపోతున్నారు. పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరూ తినాలని ప్రభుత్వం నిత్యం ప్రచారం చేస్తున్నప్పటికీ.. ఆచరణలో మాత్రం సరఫరా చేయకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

నియోజకవర్గంలో ఇలా

గురజాల నియోజకవర్గంలో నాలుగు మండలాలు ఉన్నాయి. గురజాలలో 38, దాచేపల్లిలో 42, మాచవరంలో 38, పిడుగురాళ్ల 79 రేషన్ దుకాణాలు ఉన్నాయి. గురజాలలో 21,396, దాచేపల్లిలో 22,689, మాచవరంలో 16,271, పిడుగురాళ్లలో 44,020 రేషన్ కార్డుదారులున్నారు. ఇంటింటికి తిరిగి రేషన్ పంపిణీని గత ప్రభుత్వం గురజాలలో 14, దాచేపల్లిలో 15, మాచవరంలో 11, పిడుగురాళ్లలో 24 మినీ వ్యాన్ల ద్వారా చురుగ్గా చేపట్టింది. సరుకులు నేరుగా ఇంటి వద్దనే ఇవ్వడం, నాణ్యమైన బియ్యం సరఫరా చేసింది. కానీ నేడు ఆ వాహనాలను తొలగించి, పాత విధానంలో రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి క్యూలో గంటల తరబడి వేచి ఉంచి రేషన్ తెచ్చుకునే విధంగా చర్యలు చేపట్టారు.

మార్చిలో ఖాళీ

గత ఐదు నెలలుగా నియోజకవర్గంలోని రేషన్ కార్డుదారులకు 40–50 శాతం మాత్రమే కందిపప్పు పంపిణీ చేశారు. అరకొరగా పప్పును సరఫరా చేస్తున్నారు. మార్చిలో ఒక శాతం కూడా కందిపప్పు పంపిణీ చేయలేదు. కంది, పంచదార, బియ్యం, గోదుమపిండితో పాటు పంపిణీ చేయాల్సి ఉంది. కానీ, ఆ పరిస్థితులు ఎక్కడా కనిపించడం లేదు. ప్రభుత్వం నుంచి అందిస్తున్న సరుకుల్లో..ఏ నెల ఏ సరుకు సరఫరా నిలిచిపోతుందో కార్డుదారులకూ అర్థం కావడం లేదు.

రైల్వేస్టేషన్‌లో నాడు-నేడు



ప్లాట్‌ఫాంపైకి అల్లుకుపోయిన ముళ్లపొదలు



ముళ్ల పొదలను తొలగించిన తర్వాత రైల్వేస్టేషన్



రైల్వేస్టేషన్ చుట్టూ ఉన్న ముళ్ల పొదలు



ముళ్ల పొదలు లేని కార్యాలయం

సాక్షి ఎఫెక్ట్

రెంటచింతల: రెంటచింతల రైల్వే స్టేషన్‌కు ఆదాయం పుష్కలం ఉంది. కానీ, రైల్వేస్టేషన్ పరిసరాల్లో పారిశుద్ధ్య పూర్తిగా లోపించింది. ప్లాట్ ఫాం పైకి ముళ్లపొదలు ఉండటంతో విషసర్పాలకు నిలయంగా మారింది. ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించిన సంబంధిత అధికారులు రైల్వే స్టేషన్‌లో ముళ్ల పొదలను తొలగించారు. దీంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేస్టేషన్లో కనీస సౌకర్యాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం జరిగేనా?



మాచర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయం

మాచర్ల రూరల్: మండల ప్రజా పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. అయితే గత రెండు సమావేశాలు కోరం లేక వాయిదా వేశారు. 2021 స్థానిక సంస్థలకు జరిగిన ఎన్నికల నుంచి టీడీపీ తప్పుకోవటంతో వైఎస్సార్ సీపీ 14 ఎంపీటీసీలు ఏకగ్రీవం చేసుకుంది. ఈ నేపథ్యంలో ఎంపీపీగా బీసీ మహిళ బూడిద మంగమ్మను, వైస్ ఎంపీపీగా ఓరుగంటి సుజాత, పెరుమాల మనీషాను ఎన్నుకున్నారు. ఏడు నెలల క్రితం ఎంపీపీ బూడిద మంగమ్మ అనారోగ్యంతో సెలవు పెడుతూ స్వయంగా జెడ్పీ సీఈఓకు కలిసి పత్రాన్ని అందించారు. తన తరువాత ఉపాధ్యక్షురాలుగా ఉన్న పోతిరెడ్డి సుజాతకు బాధ్యతలు ఇవ్వాల్సిందిగా తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మండల పరిషత్ పై పట్టు సాధించాలనే కుట్రలకు తెరలేపారు. ఈ నేపథ్యంలో ఏడు నెలల నుంచి ఇన్‌చార్జి ఎంపీపీగా పోతురెడ్డి సుజాతకు ఆదేశాలు రాకుండా అడ్డుపడుతున్నారు. వీరి కుట్రలను గమనించిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులంతా.. గత రెండు సమావేశాలను పూర్తిగా బాయ్‌కాట్ చేసి సుజాతకు ఇన్‌చార్జి బాధ్యతలిస్తేనే తాము వస్తామని అధికారులకు స్పష్టం చేశారు. దీనిని పసిగట్టిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలను కూటమి నాయకులు ఆయా గ్రామాలలో బెదిరింపులకు గురిచేస్తూ, తాము బలపరచిన పరిమళ మనీషాకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. లేకుంటే గ్రామాలలో తిరగలేరని, కేసులు పెట్టి జైలులో పెడతామంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారు. రెండవ శనివారం సెలవుదినమైనా సమావేశానికి ఖచ్చితంగా రావాలంటూ ఒత్తిడి చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు ఎంపీటీసీ సభ్యులు. ఈ పరిస్థితిలో సమావేశం జరిగేనా మళ్లీ వాయిదా పడేనా లేకుంటే, అధికార పార్టీ కుయుక్తులకు ఫలితం దక్కేనా పలువురు ఆసక్తిగా గమనిస్తున్నారు.

సీజీజీబీలో మహిళా దినోత్సవం



గురజాల : చైతన్య గోదావరి గ్రామీణా బ్యాంకు నందు శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేశారు. బ్యాంకు ఖాతాదారులు, సిబ్బందిని దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ అనిల్ కుమార్ తదితరులున్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల రేపు



తిరునాళ్ల ఏర్పాట్లపై మాట్లాడుతున్న అధికారులు

దుర్గి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల మహోత్సవం ఆదివారం జరగనుంది. ఈ నేపథ్యంలో మండల పరిధిలోని ముటుకూరు గ్రామంలో శుక్రవారం గురజాల రీజినల్ ఆఫీసర్ జగదీష్ పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామస్తులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎలక్ట్రికల్ ప్రభలకు తప్పనిసరిగా పోలీసు శాఖ నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా తిరునాళ్లను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ జెండాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తే నిర్వాహకుల పై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఆంక్షలపై పోలీసులతో పలు సూచనలు చేశారు. పలువురు సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎల్.సుధీర్ కుమార్, ఎంపీపీ యేచూరి సాయిశంకర్, సర్పంచ్ దొండపాటి చెన్నయ్య, గ్రామ పెద్దలు బ్రహ్మయ్య, లింగా రమేష్, యేచూరి సీతారామయ్య, లింగా పుల్లయ్య, యేచూరి సాంబశివరావు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలి

ఎస్ఈ విజయ్‌కుమార్

వినుకొండ: రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎస్ఈ పత్తిపాటి విజయ్‌కుమార్ ఆదేశించారు. మండల పరిధిలోని ఏనుగుపాలెం, చీకటీగలపాలెం, నీలగంగవరం, బ్రాహ్మణపల్లి, జగనన్న కాలనీ సబ్‌స్టేషన్‌లను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ సక్రమంగా ఉండేలా చూడాలని కోరారు. సబ్‌స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యుత్ శాఖ సిబ్బంది సమష్టి కృషి ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులకు తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించేలా చర్యలు తీసుకుంటుందని వివరించారు. అనంతరం ఆయన సబ్‌స్టేషన్‌లలో మొక్కలు నాటారు.

వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా చర్యలు

ఈపూరు(శావల్యాపురం): వేసవిలో విద్యుత్ కోతలు లేకుండా ముందుస్తు చర్యలు చేపట్టినట్లు డీఈ సీహెచ్ రాంబోట్లు వెల్లడించారు. శుక్రవారం ఈపూరు మండలం ఊడిజర్ల, కొచ్చర్ల, ఈపూరు, ముప్పాళ్ల గ్రామాల్లోని విద్యుత్ ఉప కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా ఈపూరు విద్యుత్ సబ్ స్టేషనులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఈ రాంబోట్లు మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు రూ.73 లక్షల బకాయిలు ఉన్నట్లు చెప్పారు. ఇంటి కనెక్షన్లు బకాయిలు రూ.94లక్షలు, వీధి దీపాలు బకాయి రూ.23 లక్షలు మండలంలో ఉందన్నారు. నూరుశాతం వసూలు అయ్యే విధంగా అధికారులు బాధ్యత వహించాలన్నారు. రేమిడిచర్ల, ఈపూరు, రొంపిచర్ల 132 కేవీ సబ్ స్టేషన్లు ఏర్పాటుకు అంచనాలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశామని చెప్పారు. సమావేశంలో ఏడీఏ భవనం వెంకటేశ్వరరెడ్డి, ఏఈ సంపెంగుల గాంధీ, లైన్ ఇన్‌స్పెక్టరు భవనాశి రవికుమార్, లైన్‌మెన్స్ మేడికొండ ఆనంద భాగ్యయేసోనుకుమార్, ఎం.రమణానాయక్ ఉన్నారు.

పనిలో భద్రత ముఖ్యం



దాచేపల్లి : పనిలో భద్రత చాలా ముఖ్యమని, భద్రతే ప్రగతికి తొలి మెట్టు అని డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరమేశ్వరరావు అన్నారు. మండలంలోని గామాలపాడులోని సాగర్ సిమెంట్‌లో జాతీయ భద్రత దినోత్సవ ముగింపు వేడుకలు శుక్రవారం జరిగాయి. కార్మికులు, ఉద్యోగులతో కలిసి అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. పరమేశ్వరరావు మాట్లాడుతూ పరిశ్రమల యజమానులు ముందస్తుగా భద్రతా చర్యలు చేపట్టి, అనంతరం పనులు చేసేలా కార్మికులకు అవగాహన కల్పించాలన్నారు. జీరో ప్రమాదాల సంవత్సరంగా 2025ను ప్రకటించేలా సమష్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రీంబాబు, ఫ్యాక్టరీస్ వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్.సుబ్బారావు, అధికారులు నరేంద్ర రెడ్డి, రామకృష్ణ, నవీన్‌రెడ్డి, నాగభూషణం, వీరప్రసాద్ పాల్గొన్నారు.

ఏపీపీగా కందిమళ్ల సూర్యరాజు



గురజాల : పదొవ అదనపు జిల్లా కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కందిమళ్ల సూర్యరాజును నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటివరకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బి.నాగిరెడ్డి బాధ్యతలు నిర్వహించారు.

పీ-4 సర్వే నిష్పక్షపాతంగా నిర్వహించాలి

మాచవరం: స్వర్ణాంధ్ర విజన్- 2047లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన పీ–4 (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్) సర్వేను తప్పిదాలకు తావులేకుండా నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంగళరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు పీ–4 సర్వేపై సిబ్బందికి అవగాహనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

'ప్రసన్నాంజనేయస్వామి' వార్షికోత్సవం



గురజాల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం మూడవ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. భక్తులు వేకువ జాము నుంచి స్వామి వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు కారెంపూడి మాదవాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. తాడువనేని పుల్లయ్య సీతారావమ్మల జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఉత్సవ విగ్రహాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులకు అందించారు.

సమగ్రంగా సర్వే చేపట్టాలి



మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి

రెంటచింతల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల భాగస్వామ్యంలో భాగంగా మండలంలోని ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేపట్టాలని మిట్టగుడిపాడు గ్రామ పంచాయతీ కార్యదర్శి మాడూరి వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గ్రామ సచివాలయాలకు నోడల్ అధికారులుగా నియమించిన సిబ్బందికి పీ4 విధానంపై శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రతి ఇంట్లో ఉన్న వారికి వివరించి, వారి ఆర్థిక పరిస్థితిని అంచనా వేసి ప్రజలకు ప్రైవేటు రంగాల ప్రజలకు సహాయం అందించే ప్రక్రియ అని ఈ సర్వే ప్రధాన లక్ష్యం అన్నారు. ఎంపీడీఓ కె. సరోజినిదేవి, ఈవోపీఆర్డీ చినుకూరి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శ్రీదేవి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభసాటి



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు

దాచేపల్లి: తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తెచ్చే ప్రకృతి వ్యవసాయం రైతులు చేయాలని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం, ఖరీఫ్ యాక్షన్ ప్లాన్‌పై అధికారుల సమావేశం శుక్రవారం జరిగింది. ఏడీఏ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో రోగాలు దరిచేరవన్నారు. ప్రకృతి వ్యవసాయం మంచి లాభసాటి అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు ముందు రైతులందరూ నవధాన్య విత్తనాలు పొలంలో చల్లాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రవికుమార్, ఏఓ పాపకుమారి, లాం శాస్త్రవేత్తలు శివారెడ్డి, సీసీ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ మహిళా దినోత్సవం



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మాచవరం: మండలంలోని పిన్నెల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ ఆధ్వర్యములో మహిళా దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. సీనియర్ మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. పలువురు మాట్లాడుతూ విద్యతోనే మహిళలు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఉన్నారని పేర్కొన్నారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్కే జమాల్ మండల అధ్యక్షుడు ఎం.జగన్నాథం, గౌరవ అధ్యక్షుడు కె.నరసింహారావు, సీఆర్పీ మార్తమ్మ, హెచ్ఎం కె.శారదాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి



మాట్లాడుతున్న ఏడీఏ మస్తానమ్మ

నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అనుబంధ విభాగాల సమన్వయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఏడీఏ మస్తానమ్మ, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి, మండల వ్యవసాయ అధికారి నరేంద్రరెడ్డి, మండల ఉద్యానశాఖ అధికారి నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మస్తానమ్మ మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్‌కు ముందు ప్రతి రైతు తన పొలంలో పీఎండీఎస్(నవధాన్య) విత్తనాలు చల్లాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆచరించడం వలన చీడపీడల నివారణ జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి మాట్లాడుతూ నవధాన్య విధానం వలన భూమిలో వివిధ రకాల సూక్ష్మజీవుల వృద్ధి చెందడం, భూమికి కార్బన్ శాతం చేరడంతో పాటు పశువుల మేతగా ఉపయోగపడుతుందని వివరించారు. ఉద్యాన అధికారి నవీన్ మాట్లాడుతూ రసాయన పురుగు మందులు అధికంగా ఉపయోగించడంతో ప్రస్తుత మార్కెట్లో లభిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు విషపూరితంగా మారి క్యాన్సర్, గుండె జబ్బులకు దారితీస్తున్నాయని తెలిపారు.